క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీలు, బీరువా అందజేత



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ జవహర్, బదరీనారాయణ, ఎంఈఓ

చీమకుర్తి: స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు దాత మూలె వెంకటేశ్వరరెడ్డి ఆర్థిక సహకారంతో కుర్చీలు, బీరువా, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందించారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ.జవహర్, చలువాది బదరీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి చేతుల మీదుగా వాటిని పాఠశాల హెచ్ఎం జే.యాకోబుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు కనీస మౌలిక వసతులు కల్పించిన వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, టీచర్‌లు పాల్గొన్నారు.

వలంటీర్‌లకు సేవామిత్ర పురస్కారాలు



వలంటీర్‌లను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ విజయలక్ష్మి చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు అందించి శాలువాలతో సత్కరించారు.

కవితల పోటీ విజేత డాక్టర్ మొగిలి దేవ

ఒంగోలు: ఐఎస్ఓ గుర్తింపు పొంది 21 ప్రపంచ రికార్డులు సాధించిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీలో తాను టాప్ 20 విజేతల్లో నిలవడం ఆనందంగా ఉందని డాక్టర్ మొగిలి దేవ పేర్కొన్నారు. లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ అనే అంశంపై వెయ్యి మందికిపైగా ఆన్‌లైన్‌లో పాల్గొన్న కవితల పోటీలలో తాను రాసిన సృష్టి అనే కవిత ఉత్తమమైనదిగా ఎంపికైందన్నారు. ఈ మేరకు తనకు శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, చైర్‌పర్సన్ బోయి హైమావతి భీమన్న సోమవారం సర్టిఫికెట్ జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మొగిలిదేవను పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే జీతాలివ్వాలి

ఒంగోలు: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న క్లాప్ మిత్ర, కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రా పేరుత గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పారిశుధ్య కార్మికులు పరిరక్షిస్తున్నారన్నారు. వీరికి 16 నెలలుగా జీతాలు లేవని, ఈ నేపథ్యంలో వారు ఎలా జీవించాలన్నారు. పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని, పారిశుధ్య నిర్వహణకు కార్మికులను నియమించిన ప్రభుత్వం జీతాలు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి క్లాప్ మిత్ర, కాంట్రాక్టు కార్మికుల జీతాల బకాయిలు పూర్తిగా చెల్లించాలని, భవిష్యత్‌లో ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు దానయ్య, గాలెయ్య పాల్గొన్నారు.

పురోహిత పరిషత్‌కు మంచి పేరు తీసుకురావాలి

- గోనుగుంట్ల బ్రహ్మానంద శర్మ

ఒంగోలు: పరిషత్ అభివృద్ధితో పాటు వైదిక కార్యక్రమాలు శాస్త్రీయంగా నిర్వహించాలని ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ వ్యవస్థాపకుడు గోనుగుంట బ్రహ్మానంద శర్మ అన్నారు. సోమవారం స్థానిక సీతారామపురంలోని శ్రీసుందరేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన పరిషత్ సర్వసభ్య సమావేశంలో దేవాలయ వాస్తు, గృహ వాస్తు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షుడు గోనుగుంట మోహన కృష్ణశాస్త్రి, ప్రధాన కార్యదర్శి కొప్పరపు వెంకట కృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

నేడు ఉప్పుగుండూరులో విద్యుత్ అదాలత్

నాగులుప్పలపాడు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఉప్పుగుండూరులో జరిగే విద్యుత్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ రమేష్ సూచించారు. ఈ విద్యుత్ అదాలత్‌కు ఈఈ పాలగిరి శ్రీనివాసులు, డీఈఈ రాయపూడి మోహన్ రావు హాజరవుతారన్నారు.

వలంటీర్లతోనే జగనన్న సురక్ష విజయవంతం

- రాపర్ల, పోతవరం గ్రామ సభల్లో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థతోనే క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయని, జగనన్న సురక్ష కార్యక్రమం కూడా విజయవంతమైందంటే వలంటీర్లతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం పోతవరం, రాపర్ల గ్రామాల్లో నిర్వహించిన సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధాకర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా అందుతున్న సేవలను ఓర్చుకోలేని వారు ఆయా వ్యవస్థలపై విషం కక్కడం బాధాకరమన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబులు కలిసి కట్టుగా చేస్తున్న ఈ కుట్రను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. అసలు గెలుస్తాడో లేదో కూడా తెలియని చంద్రబాబుకు, దత్తపుత్రుడికి అధికారం వస్తే ఈ వ్యవస్థలను రద్దు చేస్తాం అనడం పాలనను ప్రజలకు దూరం చేయడమే అన్నారు. అనంతరం జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉచితంగా అందుతున్న వివిధ రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. పోతవరం సభలో ముందుగా ఎమ్మెల్యే సుధాకర్ బాబు, ఎంపీపీ దంపతులు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి సచివాలయ సిబ్బంది, వలంటీర్లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీఓ జయమణి, పోతవరం, రాపర్ల, చవటపాలెం గ్రామాల సర్పంచ్‌లు శీలం రేణుకా సురేష్, ఢాకా అనసూర్యమ్మ రమణారెడ్డి, కాట్రగడ్డ వనజ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారు బాబు, జెడ్పీటీసీ యాదల రత్నభారతి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, మారెళ్ళ వెంకటశేషయ్య, కూనం పూర్ణచంద్రరావు, ఢాకా అంజిరెడ్డి, ఉప్పుగుండూరి శ్రీనివాస ప్రసాద్, మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్, ఇస్తర్ల అంజయ్య, రమేష్, పోలినేని కోటేశ్వరరావు, పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, కుమ్మారి సుధాకర్, వడ్డి ముక్కల శ్రీను, మున్నంగి వెంకట్రావు, దశరధరామయ్య, ఢాకా రాజీవ్, పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్: రూరల్‌లోని సర్వేరెడ్డిపాలెంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఒంగోలు తహసీల్దార్ పి.మురళి మాట్లాడుతూ 11 రకాల సర్వీసులు అర్హులైన వారికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



పోతవరం గ్రామంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, ఎంపీపీ, జెడ్పీటీసీ

పూర్తిస్థాయి సర్వే నిర్వహించిన తర్వాత ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో 996 డ్యాకుమెంట్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ కుల, మత, వర్గ రహిత సర్వే నిర్వహించినట్లు కేవలం అర్హులైన వారికి పథకాలు వర్తింపు కోసం డ్యామెంట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆదిశేషయ్య మాట్లాడారు. సొసైటీ చైర్మన్ రాపూరి వెంకయ్య, వ్యవసాయ అధికారి కిశోర్‌బాబు, గ్రామ కార్యదర్శి రాంమోహన్‌రావు, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్‌లు ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెం (కొత్తపట్నం): గ్రామంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష సభ నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. మండలంలో రాజుపాలెంలో సోమవారం రెండు టీమ్‌లు కలిసి సర్పంచ్ కొండూరి పోలమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమంలో పలు రకాల పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాలు అందని వారికి 11 రకాల సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. సర్టిఫికెట్లు అందని వారికి ఆగస్టు ఒకటో తేదీన పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నూరు శాతం సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ.బాల చెన్నయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ లింగంగుంట వెంకటేశ్వర్లు, కొండూరి గోవిందు, కార్యదర్శి వంశీకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలిచ్చేందుకే జగనన్న సురక్ష

మద్దిపాడు: అర్హులందరికీ పథకాలు వర్తింపజేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని కొలచనకోట, మల్లవరం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా 99.5 శాతం అమలు చేశారని, కానీ ఏ ఒక్కరూ అనర్హులుగా మిగిలి పోవడానికి ఇష్టపడని ముఖ్యమంత్రి వారికి పథకాలు వర్తింపజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. టెక్నికల్ సమస్యల వలన పథకాలు రాని వారికి తగిన సర్టిఫికెట్లు ఈ కార్యక్రమంలో మంజూరు చేసి వారికి కూడా పథకాలు వర్తింపజేయాలని అధికారులను ఆదేశించారని అన్నారు. తాను ప్రజల వద్దకు వెళ్లే సమయానికి ఏ ఒక్కరూ తమకు పథకాలు వర్తించలేదన్న మాట వినిపించరాదని ఆయన తెలిపారని అందుకే అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, తహశీల్దార్ రజనీకుమారి, ఏఓ సుబ్బారావు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, ఎంపీటీసీలు బొమ్మల దాసు, పైనం ప్రభాకర్, బొమ్మల రామాంజనేయులు, అన్వేష్, నాగమల్లీశ్వరి, గ్రామ నాయకులు విల్సన్, సర్పంచ్ డొక్కా మరియమ్మ, మోరబోయిన సుబ్బయ్య, డొక్కా సింగయ్య, మస్తానమ్మ, హరిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మల్లవరంలో..

ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ ఆశాజ్యోతి, సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, స్టేట్ డైరెక్టర్ నారా విజయలక్ష్మి, రావూరి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీవో, నాయకులు



రాజుపాలెంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి, పోలమ్మ, కోటేశ్వరరావు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో సర్పంచ్

దళితులు మరో ఆత్మగౌరవ పోరాటానికి సిద్ధం కావాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు



మాట్లాడుతున్న దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్

ఒంగోలు: దళితులు మరో ఆత్మగౌరవ పోరాటానికి సిద్ధం కావాలని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక దళిత మహాసభ కార్యాలయంలో జరిగిన కారంచేడు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంచేడులో మాదిగలపై కమ్మ భూస్వాములు గండ్రగొడ్డళ్లు, బాకులుతో దగ్గుబాటి చెంచురామయ్య ఆధ్వర్యంలో మాదిగపల్లెపై దాడి చేసి తేళ్ల మోషే, తేళ్ల యెహోషువా, దుడ్డు వందనం, దుడ్డు రమేష్‌లను హతమార్చారన్నారు. మిగిలిన ప్రజలు మొత్తం చీరాలకు పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నారని, ఇందులో చాలామంది కమ్మ భూస్వాముల దాడిలో క్షతగాత్రులుగా మిగిలారని విచారం వ్యక్తం చేశారు. దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ కారంచేడు సంఘటనపై దళిత ఉద్యమం ఉవ్వెత్తున సాగి దేశానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సాధించుకున్నట్లు గుర్తు చేశారు. వేలాదిమంది దళితులు కారంచేడు మాదిగల ఆశయాలకు అనుగుణంగా నేటికి పనిచేస్తున్నారన్నారు. దళిత బహుజనులంతా రాజ్యాధికారం సాధించినప్పుడే కారంచేడు మృతవీరులకు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా బత్తుల రమణయ్య, మహిళా నాయకురాలు దరిశి నాగేంద్రం, యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు తలుపుల శ్రీనివాసరావు, బత్తుల అశోక్, కమలాకర్, మోహన్, కాలే రమణయ్య, పాల్గొని కారంచేడు అమరవీరులకు నివాళులర్పించారు.

సోషలిస్టు మహాజన పార్టీ ఆధ్వర్యంలో..

స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోషలిస్టు మహాజన పార్టీ ఆధ్వర్యంలో కారంచేడు అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ మాదిగ మాట్లాడుతూ 38 ఏళ్ల క్రితం జూలై 17న కారంచేడు మాదిగ పల్లెపై జరిగిన మారణ కాండ నేటికి కళ్లముందు కదలాడుతూనే ఉందన్నారు. మంచినీటి చెరువు వద్ద మొదలైన ఘర్షణ పల్లెపై దాడికి కారణమైన ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ప్రశ్నించడమే నేరమైతే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ హక్కును కాలరాయడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొంటూ కారంచేడు అమరవీరులకు జోహార్లు అర్పించారు.

కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఆదిముల ప్రకాష్ మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు బాబు మాదిగ, రావినూతల కోటయ్య మాదిగ, రాజు, పేరయ్య, శామ్యూల్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉన్మాదుల దాడులను ప్రతిఘటిద్దాం

దళితులపై అగ్రకుల, ఉన్మాదుల దాడులను ప్రతిఘటిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మాదాల నారాయణస్వామి స్మారక భవన్‌లో కారంచేడు మృతవీరుల వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాటి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985 జూలై 17న కారంచేడు మాదిగ పల్లెపై అగ్రకుల ఉన్మాదులు దాడిచేసి ఏడుగురిని హతమార్చారని, 42 మందిని తీవ్రంగా గాయపరిచారన్నారు. పిడికెడు ఆత్మగౌరవం కోసం, భూమి కోసం, భుక్తికోసం పరితపిస్తున్న దళితులపై, గిరిజనులపై అగ్రకుల ఉన్మాదుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న మాట్లాడుతూ కారంచేడు మారణకాండ వ్యతిరేక పోరాట ఫలితంగా ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం పురుడు పోసుకుంటే చుండూరు మారణ కాండ వ్యతిరేక పోరాట ఫలితంగా 1992ల అత్యాచారా నిరోధక చట్టానికి నియమ నిబంధనలు సాధించుకోవడం సాధ్యపడిందన్నారు. దళితులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రగతిశీల శక్తులు ఐక్యంగా అగ్రకుల ఉన్మాదుల దాడులను ప్రతిఘటించాలన్నారు. ఐఎఫ్‌టీయు పట్టణ నాయకులు వి.రామ్మోహన్, పీడీఎస్‌యూ నాయకులు కోటయ్య పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం

- మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష పథకంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందిస్తున్నామని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత చెప్పారు. ఈ మేరకు ఒంగోలు నగరంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో జరిగిన పథకం క్యాంపు సభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి సర్టిఫికెట్ ఉచితంగానే ఇస్తున్నామని చెప్పారు. 21వ డివిజన్‌కు సంబంధించి స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కార్పొరేటర్ యనమల నాగరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సభ నిర్వహించారు. 22వ డివిజన్లో స్థానిక ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కృష్ణుడు గుడి వద్ద నిర్వహించారు. 25వ డివిజన్‌లో కూడా క్యాంపు నిర్వహించారు. క్యాంపుల్లో పలు రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో సర్వే చేపట్టామన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫీజు లేకుండానే ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తున్నామని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్టిఫికెట్లు సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష ఉద్దేశమన్నారు. పథకాలు రాకుండా ఉండటానికి సాంకేతిక పరమైన కారణాలు అన్వేషించి పరిష్కరించటమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, 21వ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు, 22వ డివిజన్ కార్పొరేటర్ కారంశెట్టి రామ పుష్పలత కిరణ్, వేమూరి శ్రీనివాసరావు, డివిజన్ల కన్వీనర్ కొమ్మూరి రవిచంద్ర, ఎంఈ కె.మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులుతో పాటు పలువురు పాల్గొన్నారు.




లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు

క్విస్ అధ్యాపకునికి డాక్టరేట్

ఒంగోలు: క్విస్ అధ్యాపకునికి హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ హెచ్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన మెకానికల్ విభాగంలో చేసిన నూతన రీసెర్చికి ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈయన క్విస్ కాలేజీలో మెకానికల్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానికంగా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయత్రీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావులు అభినందించారు.

ఉత్తమ సామాజిక సేవకు డాక్టరేట్



పల్లపు అంకారావు

ఒంగోలు: ఉత్తమ సామాజిక సేవకు డాక్టరేట్ డిగ్రీని పల్లపు అంకారావు అందుకున్నారు. ఒంగోలుకు చెందిన పల్లపు అంకారావు కరోనా సమయంలో పేదలకు వైద్య సేవలు అందించడం, ఆహారాన్ని అందించి ఉత్సాహంగా పని చేశారు. గాయత్రీ చారిటబుల్ ఫౌండేషన్ పేరుతో ప్రస్తుతం హైదరాబాద్‌లో సేవలు అందిస్తుండగా ఆయనకు విజయవాడలో హోప్ థియోలాజికల్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను బహూకరించింది.

చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసిన ఎస్పీ

ఒంగోలు: అనాథ, అభాగ్యులైన పిల్లలు విద్యకు, విజ్ఞానార్జనకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు హోంను సందర్శించిన ఆమె ఆశ్రయం పొందుతున్న తల్లిదండ్రులు లేని, నిరాదరణకు గురైన బాలికలకు లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ సౌజన్యంతో దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమం వాతావరణాన్ని పరిశీలించిన అనంతరం చిన్నారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి యోగక్షేమాలు ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. మంచిగా చదువుకుంటే ఉద్యోగం వస్తుందని, తద్వారా మరో పది మందికి సాయపడగలరంటూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. బొమ్మరిల్లు ఆశ్రమ నిర్వాహకులును ఉద్దేశించి మాట్లాడుతూ బాలబాలికల బాగోగులను కన్నబిడ్డల్లా చూసుకుంటూ నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో విద్యను అందించడం అభినందనీయమన్నారు. నేటి బాలలే రేపటి దేశభవిష్యత్తు అనే వాస్తవాన్ని సమాజానికి వివరించి దేశ సౌభాగ్యానికి పిల్లల చదువు, వారికి సరైన ఎదుగుదల అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎస్బీ డీఎస్పీ మరియదాసు, టూటౌన్ సీఐ ఎస్.జగదీష్, బొమ్మరిల్లు ఆశ్రమ నిర్వాహకులు రాజ్యలక్ష్మి, ఖాశిం, లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ నిర్వాహకులు ప్రేమ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బొమ్మరిల్లు చిన్నారులతో ఎస్పీ మలికాగర్గ్

కార్పొరేట్ స్థాయి వైద్యం ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యం

ఒంగోలు రూరల్: కార్పొరేట్‌స్థాయి వైద్య సాయం అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఒంగోలు రూరల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. రూరల్ లోని వలేటివారిపాలెంలో సోమవారం 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. తొలుత మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో కూడా అధునాతన సౌకర్యాలతో కూడిన ఈసీజీ, ఎమ్మారై, సీటీ స్కాన్ వంటి సేవలు అందజేస్తోందని, ఫలితంగా వేలకు వేలు ఖర్చు పెట్టి ఈ సేవలు పొందలేని నిరుపేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అక్కడికక్కడే జరిగి సంబధిత మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తిరిగి వ్యాధి నిర్ధారణ అయిన వారికి మొబైల్ నెంబరు అందజేసి అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుర్చి వారి సందేహాలు నివృత్తి కోసం టెలీ మెడిసన్ ద్వారా సేవలు అందించనున్నట్లు తెలిపారు. 104 వాహనం వద్దకు వచ్చి వైద్య సేవలు పొందిన వారి వివరాలు గోప్యంగా ఆన్‌లైన్ చేస్తారని పేర్కొన్నారు. నాన్ ఎన్‌సీడీ–సీడీ–స్క్రీనింగ్ 260 కేసులు, ఓపీ పేషంట్‌లు 122 మంది వచ్చారు. సీహెచ్‌వో జయలక్ష్మి, డీఏ నాగజ్యోతి, సూపర్‌వైజర్ శివప్రసాద్, వాసు పాల్గొన్నారు.

వేగంగా రీసర్వే

ఒంగోలు రూరల్: ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన భూముల రీ సర్వే కార్యక్రమం వేగంగా జరుగుతోంది. జిల్లాలో తొలిసారిగా అధునాతన టెక్నాలజీతో గుడిమెళ్లపాడులో సర్వే ఆఫ్ ర్యాంక్స్ ఆంధ్రప్రదేశ్ అధునాతన టెక్నాలజీతో సర్వే ప్రారంభించింది. వందల సంవత్సరాల క్రితం బ్రిటీష్ వారు వేసిన సర్వే హద్దు రాళ్లు భూగర్భంలో కలిసి పోయాయి. నాటి నుంచి అనేకమార్లు క్రయ, విక్రయాలకు గురవుతున్న భూములు నిర్దిష్టమైన భూమి హక్కుదారులకు లభించడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి హక్కుదారులకు సరైన భూమి కొలతలతో ఉండాలని, శాశ్వత హద్దు రాళ్ల మ్యాపింగ్ ద్వారా ఏర్పాటు చేయాలని పరస్పర అంగీకారంతో కొలతలు నిర్వహించడం ద్వారా రానున్న తరాలకు సివిల్, క్రిమినల్ భూ తగాదా రాకుండా ఉండేందుకు మండలంలోని అన్నీ గ్రామాల సర్వేయర్లతో పాటు మండల సర్వేయర్లు సర్వే నిర్వహిస్తున్నారు. ఒంగోలు మండల తహసీల్దార్ పి.మురళి చేజర్ల సర్వే అనంతరం వలేటివారిపాలెం గ్రామంలో పూర్తిస్థాయి సర్వే చేపట్టారు. ఇందులో భాగంగానే సర్వే నిర్వహించే ప్రాంతం రైతులందరినీ వారి భూ పత్రాలు దశాబ్దాల నుంచి ఉన్న తహసీల్దార్ కార్యలయ రికార్డులు సరి చూసి సర్వే నిర్వహించి హద్దురాళ్లు వేస్తున్నారు. ఇందులో భాగంగానే మండల తహసీల్దార్‌తో పాటు రీసర్వే సర్వేయర్ల న్యాయకత్వం వహిస్తున్న కొండారెడ్డి గ్రామ రైతులకు సమావేశం నిర్వహించి రీ-సర్వే ప్రయోజనాలు తెలిపారు. గ్రామ కార్యదర్శి రంగారెడ్డి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ హేమలత పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు ఎంపిక

చీమకుర్తి: గోనుగుంట జిల్లాపరిషత్ హైస్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు నెప్పల లక్ష్మీప్రసన్న, పావులూరి అఖిల జాతీయ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు హెచ్ఎం బండి శ్రీనివాసరావు, పీఎస్ టీచర్ సోమా శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ రెండు సంవత్సరాలకు కలిపి ఒక్కో ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు జాతీయ స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

వీఓఏపై వివక్ష చూపే వారిపై చర్యలు తీసుకోవాలి

నాగులుప్పలపాడు: మట్టిగుంట గ్రామంలో వీవోఏ గా పనిచేస్తున్న ఎస్సీ యువతి ఇందువాణి పట్ల వివక్ష చూపుతూ కులం పేరుతో దూషిస్తున్న మాజీ వీవోఏ జాగర్లమూడి విశాలాక్షిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యులు కొమ్మూరి గరటయ్య కోరారు. మట్టిగుంట గ్రామంలో డా.వైఎస్సార్ క్రాంతి పథంలో గ్రామ వీవోఏ గా పనిచేస్తున్న ఇందువాణిపై గ్రామానికి చెందిన మాజీ వీవోఏ విశాలాక్షి వివక్ష చూపుతున్నారని ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం మండలం కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ ఘటనపై ఏపీఎం రవి కుమార్‌ను వివరణ కోరగా గతంలో గ్రామ సమైఖ్య సంఘం తీర్మానంతోనే ఇందువాణిని వీవోఏ గా నియమించారని, ఆమే వీవోఏగా కొనసాగుతారన్నారు. నిరసన కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు రావినూతల కోటి, మల్లెల ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు పక్కా ప్రణాళికే ముఖ్యం

- కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ రాధాకృష్ణ

ఒంగోలు: విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు పక్కా ప్రణాళికే ముఖ్యమని మోటివేషన్ స్పీకర్, కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక జాహ్నవి నీట్ అకాడమీలో జరిగిన అన్‌లాక్ యువర్ పొటెన్షియాలిటీ అనే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సామర్థ్యాలను ఎలా పెంపొందించుకోవాలి, వాటిని బయటకు తీయడం ఎలా, విద్యా సంవత్సరం పట్ల ఎలా ప్లాన్ చేసుకోవాలి, అందుకు పాటించాల్సిన సూత్రాలు వివరించారు. ఒత్తిడి లేకుండా మార్కులు పొందడం, భయం లేకుండా సరళమైన విధానంలో ఉత్తమ ఫలితాలు సాధన అనే అంశంపై అవగాహన కల్పించారు. జాహ్నవి నీట్ అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే లక్ష్యంగా పెట్టుకోవాలి

- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి

మడనూరు (కొత్తపట్నం): ఖరీఫ్ సీజన్‌కు ప్రకృతి వ్యవసాయం లక్ష్యంగా పెట్టుకుని సాగుబడి చేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ పాలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సుభాషిణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన పంటతో పాటు సరిహద్దు పంటలు, అంతర్ పంటలు సాగుబడి చేయాలని సూచించారు. పూర్తిగా ఒక ఏరియాలోని మొత్తం రైతులు కలిసి ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో లక్ష్యాలు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రెడ్డెప్ప, పురిణి బ్రహ్మయ్య, రామారావు, ఇందిరా, ఎస్కే రెహమాన్, బాషా పాల్గొన్నారు.

21 నుంచి ఓటర్ల ఇంటింటి సర్వే



తహసీల్దార్‌లతో ఓటర్ల వెరిఫికేషన్‌పై సమీక్షిస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వరకుమార్

చీమకుర్తి: ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికీ ఓటర్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వరకుమార్ తెలిపారు. సోమవారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరకుమార్, చీమకుర్తి తహసీల్దార్ పీ.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఇంటింటికీ బీఎల్‌ఓలు వచ్చినప్పుడు వారి ఇంట్లో ఉన్న ఓట్లు సక్రమంగా ఉన్నాయా...? లేదా సరిచూసుకోవాలని, చనిపోయిన వారి ఓట్లను తీయించాలని తెలిపారు. ఇదే సమయంలో నూతనంగా ఓటు లేని వారిని కూడా చేర్చుకోవడానికి బీఎల్‌ఓలు సహకారం అందిస్తారన్నారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ బూత్‌లలో కూడా ఏమైనా మార్పులు ఉంటే అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ అభ్యంతరాలను తెలియజేయాలని తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఓటర్లు, పార్టీల నాయకులు సహకరించాలని చీమకుర్తి తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.